క్లుప్తంగా

అమ్మవారి సేవలో ప్రముఖులు



ఆలయం వద్ద సుప్రీంకోర్టు న్యాయమూర్తులు

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు పద్మావతి అమ్మవారిని శుక్రవారం సుప్రీం కోర్టు జడ్జీలు సుబ్రమణ్యన్, సుందరేష్, రాష్ట్ర మంత్రి విశ్వరూప్, ప్రభుత్వ చీఫ్ విప్ ప్రసాద్‌రావు దర్శించుకున్నారు. వారికి అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం కల్పించారు. వేద పండితులు ఆశీర్వచనం పలుకగా అధికారులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అనాథ శవాల కోసం ప్రత్యేక వాహనం

తిరుపతి తుడా: తిరుపతి నగరంలో అనాథ శవాల తరలింపునకు ప్రత్యేక వాహనాన్ని ఏర్పాటు చేయాలని డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ కోరారు. ఆయన శుక్రవారం కమిషనర్ హరితకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు తిరుపతికి వస్తుంటారని, కొంతమంది అనాథలు రోడ్లపైనే మృతి చెందుతున్నారని తెలిపారు. వారి దహనక్రియలు ప్రశ్నార్థకంగా మారుతున్న క్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ బాధ్యత తీసుకోవాలని కోరారు.

ముగిసిన ఉచిత వేసవి శిక్షణ

తిరుపతి ఎడ్యుకేషన్: ఎస్వీ యూనివర్సిటీ హోమ్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో గత నెల 3 నుంచి జూన్ 1వ తేదీ వరకు చేపట్టిన హస్తకళల ఉచిత వేసవి శిక్షణ శిబిరం ముగిసింది. ఇందులో పదేళ్లలోపు చిన్నారులకు హోమ్ సైన్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ సుచరిత ఆధ్వర్యంలో రిసోర్స్ పర్సన్లు శ్రీప్రియ, ఆశ్రిత అల్లికలు, పెయింటింగ్ తదితర హస్తకళల్లో శిక్షణ ఇచ్చారు. ముగింపు సందర్భంగా శిక్షణ పొందిన చిన్నారులకు సర్టిఫికెట్లను ఎస్వీయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ కేటీఆర్.రెడ్డి అందజేశారు.

ఎస్ఎఫ్ఓగా గుణశేఖర్‌రెడ్డి



పాకాల: స్థానిక అగ్నిమాపక కేంద్రం ఎస్ఎఫ్ఓగా గుణశేఖర్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన నంద్యాల జిల్లా శ్రీశైలం ఫైర్ స్టేషన్ నుంచి బదిలీపై పాకాలకు వచ్చారు. ఆయన మాట్లాడుతూ ఎక్కడైనా అగ్ని ప్రమాదాలు సంభవిస్తే వెంటనే 08585-222101, 9963736957, 101కు ఫోన్ చేయాలని కోరారు. బదిలీపై వచ్చిన ఆయనకు సిబ్బంది శాలువా కప్పి స్వాగతించారు.

జగనన్న స్ఫూర్తితో తిరుపతి అభివృద్ధి

- మాస్టర్ ప్లాన్ రోడ్లతో ట్రాఫిక్‌కు చెక్
- డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి మంగళం: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలు, స్ఫూర్తితోనే తిరుపతి నగరాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నట్టు డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం కార్పొరేటర్ డాక్టర్ అనీష్‌రాయల్‌తో కలిసి తిరుపతి 45వ డివిజన్ శివజ్యోతినగర్‌లో సీసీరోడ్ల పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ తిరుపతి శివారు ప్రాంతాల్లో నిర్మిస్తున్న 18 మాస్టర్ ప్లాన్ రోడ్లు తిరుపతి నగరానికి మణిహారంలా నిలుస్తాయన్నారు. ప్రతి డివిజన్‌లోనూ సీసీ రోడ్లు నిర్మిస్తున్నామని తెలిపారు. శివజ్యోతినగర్ నుంచి తిరుమల బైపాస్ రోడ్డు వరకు నిర్మిస్తున్న లింక్ రోడ్డు జీవకోన ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. మాస్టర్ ప్లాన్ రోడ్లు, లింక్ రోడ్లు పూర్తయితే నగర ప్రజల ట్రాఫిక్ కష్టాలు తీరుతాయన్నారు.



మాస్టర్ ప్లాన్ రోడ్ల మ్యాప్‌ను పరిశీలిస్తున్న భూమన అభినయ్‌రెడ్డి, కార్పొరేటర్ అనీష్‌రాయల్

భూమన కుటుంబానికి రుణపడి ఉంటాం

శివజ్యోతినగర్ అభివృద్ధికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే భూమన కుటుంబానికి రుణపడి ఉంటామని శివజ్యోతినగర్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఆదిశేషారెడ్డి తెలిపారు. చంద్రబాబు 22ఏను తీసుకొచ్చి శివజ్యోతినగర్‌లోని వేలాది ఇళ్లకు రిజిస్ట్రేషన్లు కాకుండా రద్దు చేశారని ఆరోపించారు. 22ఏను రద్దు చేసి తమ ఇళ్లకు రిజిస్ట్రేషన్ సౌకర్యాన్ని ఎమ్మెల్యే భూమన కల్పించారని కొనియాడారు. శివజ్యోతినగర్‌లో 20 ఏళ్లుగా సమస్యగా ఉన్న సీసీరోడ్డు పనులు చేపట్టి జీవకోన ప్రజల ట్రాఫిక్ కష్టాలను తీర్చారని తెలిపారు. టౌన్ ప్లానింగ్ అధికారి బాలసుబ్రమణ్యం, డీఈ విజయ్‌కుమార్, టౌన్‌బ్యాంకు చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి, నాయకులు రెడ్డెప్ప, రాజేశ్వరి, కోటి పాల్గొన్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ హరిత

తిరుపతి తుడా: యూజర్ చార్జీలు, ఆస్తి పన్నుల వసూలులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత హెచ్చరించారు. ఆమె శుక్రవారం ఎస్వీయూ సెనేట్ హాలులో వార్డు సచివాలయాల శానిటేషన్, అడ్మిన్ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కొంత మంది శానిటరీ సెక్రటరీలు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే యూజర్ చార్జీలు వసూలు కావడం లేదన్నారు. మరి కొంత మంది వసూలు చేసిన నగదును సకాలంలో కార్పొరేషన్ ఖజానాలో జమచేయడం లేదన్నారు. గతంలో 80 శాతం యూజర్ చార్జీలు వసూలయ్యేవని, శానిటరీ సెక్రటరీల నిర్లక్ష్యంతో 20 నుంచి 25 శాతం మాత్రమే వసూలవుతున్నట్టు వివరించారు. యూజర్ చార్జీల వసూళ్లకు సహకరించని వార్డు వలంటీర్ల స్థానంలో కొత్త వారిని నియమిస్తామని చెప్పారు. ఖాళీగా ఉన్న వలంటీర్ల పోస్టులను భర్తీ చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా 60 శాతం కన్నా తక్కువగా యూజర్ చార్జీలు వసూలు చేసిన శానిటేషన్, అడ్మిన్ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తామన్నారు. డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హరికృష్ణ, రెవెన్యూ అధికారులు కె.ఎల్.వర్మ, సేతుమాధవ్, సూపరింటెండెంట్ పి.రవి, మేనేజర్ చిట్టిబాబు, శానిటరీ సూపర్ వైజర్లు చెంచెయ్య, సుమతి పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యానికి పెద్ద పీట



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్, నేతలు

భాకరాపేట: గ్రామీణ ప్రజల ఆరోగ్యానికి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పెద్ద పీట వేశారని ఎర్రావారిపాళెం ఎంపీపీ శివలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకుడు చెంగల్‌రెడ్డి తెలిపారు. కమ్మళ్ల పంచాయతీలో జరుగుతున్న ఉచిత వైద్య శిబిరాన్ని వారు శుక్రవారం సందర్శించారు. వారు మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యంగా ఉండాలన్న ఉద్దేశంతోనే ఎమ్మెల్యే చెవిరెడ్డి వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి వైద్య పరీక్షలు చేయిస్తున్నట్టు చెప్పారు. పంచాయతీ పరిధిలోని 672 కుటుంబాలు వైద్య పరీక్షలు చేయించుకున్నట్టు తహసీల్దార్ దస్తగిరయ్య తెలిపారు. వైద్యులు కృష్ణచైతన్య పాల్గొన్నారు.

మిట్టగంగమ్మకు సారె



చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి పట్టణంలో వెలసిన మిట్టమీద గంగమ్మ జాతరను ఘనంగా నిర్వహిస్తున్నారు. అమ్మవారు బండ గంగమ్మ అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా నరశింగాపురం ఎంపీటీసీ అశ్వనిప్రవీణ్ కుమార్ ఉభయ దాతగా వ్యవహరించి మిట్టమీద గంగమ్మకు సారె సమర్పించారు. రూ.30,116, మూలస్థాన ఎల్లమ్మ ఆలయానికి రూ.10,116 విరాళం ఇచ్చారు. ఎంపీపీ హేమేంద్రకుమార్ రెడ్డి, జెడ్పీటీసీ యుగంధర్ రెడ్డి పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

పాకాల: మండలంలోని దామలచెరువు పంచాయతీ కాకర్లవారిపల్లి సమీపంలోని శిలగొంది మూల ప్రాంతంలో కామక్షమ్మ చెరువు పక్కన శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. అతనికి సుమారు 40 ఏళ్లు ఉంటాయని సీఐ రాజశేఖర్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

తిరుమల ఘాట్‌రోడ్డులో ప్రమాదాలు నివారించాలి

తిరుపతి అర్బన్: తిరుమల ఘాట్ రోడ్డులో రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని డీపీటీవో చెంగల్‌రెడ్డి ఆదేశించారు. ఆయన శుక్రవారం తిరుమల ఘాట్ రోడ్డులో తిరుగుతున్న బస్సు సర్వీసులకు చెందిన డిపో మేనేజర్లతో సమావేశమయ్యారు. ప్రమాదాలకు దూరంగా ఉంటున్న డ్రైవర్లను మాత్రమే తిరుమల ఘాట్‌రోడ్డులో పంపించాలని సూచించారు. బస్సుల కండిషన్‌ను మెకానిక్స్ ఎప్పటికప్పుడు పరిశీలించేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ మెకానిక్ నరసింహులు, డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ భాస్కర్ పాల్గొన్నారు.

యుతిక మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ప్రారంభం



తిరుపతి కల్చరల్: తిరుపతి నగరం ఎంకే నాయుడు కాలనీలో డాక్టర్లు లక్ష్మీపెద్దిరెడ్డి, శివకుమార్ పులిగుండ్ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యుతిక మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. తుడా వీసీ హరికృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని ఆస్పత్రిని ప్రారంభించారు. ఆస్పత్రి అధినేత డాక్టర్ శివకుమార్ మాట్లాడుతూ తమ ఆస్పత్రిలో ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు అందిస్తామన్నారు.

నేడు తిరుపతి రూరల్ మండల సర్వసభ్య సమావేశం

తిరుపతి రూరల్: ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అధ్యక్షతన శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకటనారాయణ శుక్రవారం తెలిపారు. చిత్తూరు, తిరుపతి ఎంపీలు రెడ్డెప్ప, గురుమూర్తి, చంద్రగిరి, తిరుపతి ఎమ్మెల్యేలు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, భూమన కరుణాకరరెడ్డి, ఎమ్మెల్సీలు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారని పేర్కొన్నారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు హాజరుకావాలని కోరారు.

బదిలీలను పారదర్శకంగా చేపట్టండి



జేసీకి వినతి పత్రం ఇస్తున్న నేతలు

తిరుపతి అర్బన్: ప్రభుత్వ పథకాల అమలులో తాము కీలక పాత్ర పోషిస్తున్నామని ఏపీ గ్రామీణ రెవెన్యూ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మురళీకృష్ణ, అధ్యక్షుడు నాగరాజ, అసోసియేషన్ ప్రెసిడెంట్ ప్రసాద్‌బాబు, తిరుపతి డివిజన్ అధ్యక్షుడు చెంగల్‌రాయల్ తెలిపారు. వారు శుక్రవారం కలెక్టరేట్‌లో జేసీ డీకే బాలాజీకి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గ్రేడ్-2 వీఆర్వోల బదిలీలకు సంబంధించి ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవడానికి ఎంపీడీవోల వద్ద నోడ్యూస్ సర్టిఫికెట్‌ను మినహాయించాలని కోరారు. అనారోగ్యంతో బదిలీలకు దరఖాస్తు చేసుకున్న వారికి న్యాయం చేయాలని పేర్కొన్నారు. వీఆర్వోల బదిలీల్లో పారదర్శకత పాటించాలని కోరారు.

మూలస్థానమ్మ ఎదుట మందుబాబుల ప్రమాణం



సత్యప్రమాణం చేస్తున్న మందుబాబులు

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి పట్టణంలో వెలసిన మూలస్థానమ్మ ఆలయం వద్ద శుక్రవారం మందుబాబులు పెద్ద సంఖ్యలో సత్యప్రమాణాలు చేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచే కాక తమిళనాడు, కర్ణాటక నుంచి కూడా పెద్ద సంఖ్యలో మందుబాబులు కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మద్యం ముట్టమని సత్యప్రమాణాలు చేసి, కంకణ ధారణ చేశారు. మధ్యాహ్నం చంద్రగిరి కాపువీధి బ్రదర్స్ తులసి, సునీల్ ఆధ్వర్యంలో ఆలయం వద్ద వెయ్యి మందికి పైగా భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ చైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డి, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన టీటీడీ అధికారుల పర్యటన

తిరుపతి తుడా: ఆయుర్వేద వైద్యంపై అధ్యయనం చేసేందుకు టీటీడీ జేఈవో సదా భార్గవి, సీఏవో శేషశైలేంద్ర, ఆయుర్వేద ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రేణు దీక్షిత్ మూడు రోజులు కేరళలో చేపట్టిన పర్యటన గురువారం ముగిసింది. తిరువనంతపురం సమీపంలోని కోవళం వద్ద గల సోమతీరం ఆయుర్వేద గ్రామాన్ని సందర్శించారు. ఇన్ పేషెంట్ గదులను పరిశీలించారు. ఫార్మసీ, పరిశోధనశాలను పరిశీలించి వాటి నిర్వహణను ఆరా తీశారు.